తాగునీటి, సీవరేజీ పైప్‌లైన్ల పునర్నిర్మాణం

● మలక్‌పేటలో రూ.100కోట్లతో ప్రతిపాదనలు

● మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని తాగునీటి, సీవరేజీ పైప్‌లైన్ల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయించినట్లు స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. శనివారం ఆయన జలమండలి మలక్‌పేట జీఎం శ్యాంనాయక్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలక్‌పేటలోని మూసారాంబాగ్, ఆస్మాన్‌ఘడ్, సైదాబాద్, మలక్‌పేట, చంచల్‌గూడ, అజంపుర సెక్షన్ల పరిధుల్లో 55.40కిలోమీటర్ల వరకు ఉన్న తాగునీటి పైప్‌లైన్లు, 52.19 కిలోమీటర్ల వరకు ఉన్న సీవరేజీ పైప్‌లైన్ల పునర్నిర్మాణానికి గాను సుమారు రూ.100కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. మలక్‌పేటలోని అనేక చోట్ల పురాతనమైన తాగునీటి, సీవరేజీ పైప్‌లైన్ల ద్వారా ఇంకా కొనసాగుతుండడంతో వాటి ద్వారా అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తాగునీరు కలుషితం కావడం, తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోవడం, లీకేజీలు, సీవరేజీ పైప్‌లైన్లు తరచూ పొంగిపొర్లడం తదితర సమస్యలు మలక్‌పేటలో నిత్యకృత్యమయ్యాయన్నారు. ఇలాంటి సమస్యలన్నింటికి శాశ్వత పరిష్కారం కోసం పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైప్‌లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయించినట్లు ఆయన తెలిపారు. జలమండలి ప్రాజెక్ట్ విభాగం ద్వారా తాగునీటి, సీవరేజీ పైప్‌లైన్ల పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఇటీవల జలమండలి ఎండీని కలిసి ప్రతిపాదనలు తయారు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయించి పైపులైన్ల పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.



జలమండలి జీఎం శ్యాంనాయక్‌తో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

ఆస్మాన్‌ఘడ్‌లో రూ.15కోట్లతో రెండు రిజర్వాయర్ల నిర్మాణం

మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోని ప్రజల తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఆస్మాన్‌ఘడ్‌లో కొత్తగా రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయించినట్లు ఎమ్మెల్యే బలాల వివరించారు. ఇందుకు రూ.15కోట్ల వ్యయమవుతుందని ప్రతిపాదనలు తయారు చేయించారు. వీలైనంత త్వరగా రిజర్వాయర్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఆస్మాన్‌ఘడ్‌లోనే నిర్మించనున్న రెండు రిజర్వాయర్లలో ఒక రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం 7.5మిలియన్ లీటర్లు, రెండో రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 2మిలియన్ లీటర్ల వరకు ఉంటుందన్నారు. జలమండలి ప్రాజెక్ట్ విభాగం అధికారులు త్వరలో పనులను ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీఎం హష్మత్‌అలీతో పాటు మేనేజర్లు, కార్పొరేటర్లు సలాం షాహిద్, మిన్హాజుద్దీన్, ఎంఐఎం నాయకులు సైఫుద్దీన్ షఫీ, షేక్ మోహీయుద్దీన్ అబ్రార్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘాల నేతలు

గ్రేటర్‌లో కల్లు కాంపౌండ్ల మూసివేతకు కుట్ర

● తెలంగాణ గౌడ సంఘాల నేతలు

పంజాగుట్ట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో కల్లు గీత వృత్తి, కాంపౌండ్లను మూసివేతకు కుట్ర జరుగుతోందని తెలంగాణ గౌడ సంఘాల నేతలు ఆరోపించారు. గ్రామానికో మద్యం దుకాణాన్ని తెరవాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ గౌడ ఐక్య సాధన సమితి, కల్లు దుకాణాల సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సమావేశంలో మాట్లాడుతూ జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, ఈ నెల 18న ఆయన జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అనధికారికంగా మూసేసిన కల్లు దుకాణాలను 10 రోజుల్లో తెరిపించాలని, లేదంటే ఉమ్మడి జిల్లాల్లో యాత్ర చేస్తామని అన్నారు. ఇందిరా పార్కు వద్ద వేల మందితో మహా ధర్నా, లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది.

వాటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు పరిష్కారం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు పరిష్కారమయ్యాయి. ఆన్‌లైన్ సేవలన్నీ శుక్రవారం రాత్రి నుంచే అందుబాటులోకి వచ్చాయి. స్టేట్ డాటా సెంటర్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో వాటర్‌బోర్డులో ఆన్‌లైన్ సేవలు గురువారం సాయంత్రం నుంచి స్తంభించిన విషయం విదితమే. ప్రస్తుతం ఆన్‌లైన్ సేవలన్నీ పునరుద్ధరించడంతో నీటి ట్యాంకర్ల బుకింగ్, డెలివరీ, నీటిబిల్లుల చెల్లింపులు, నల్లా కనెక్షన్ల దరఖాస్తులు యథాతథంగా కొనసాగుతున్నాయి.

ఫాంహౌస్‌కు పరిమితమైన కేసీఆర్: సాయికుమార్

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతగా బాధ్యతలను విస్మరించిన కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యారని రాష్ట్రఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ప్రతినెలా రూ. 2.75 లక్షలచొప్పున గడిచిన 18 నెలల కాలంలో రూ.49.5 లక్షలు తీసుకున్నారని పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో సాయికుమార్ విలేకరులతో మాట్లాడారు. 18 నెలల కాలంలో కేసీఆర్ ఒకే ఒక్క రోజు అసెంబ్లీ ముఖం చూశారని అన్నారు. కనీసం వచ్చే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకైనా కేసీఆర్ హాజరై ప్రతిపక్ష నాయకునిగా పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నీట్ పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎంబీఈఎంఎస్, నీట్ పీజీ పరీక్షలు జరుగనున్న సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు అమలులో ఉంటాయని రాచకొండ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 200 మీటర్ల పరిధిలో ఐదుకంటే ఎక్కువ మంది గుమిగూడటం, సమావేశాలు నిర్వహించడం చేయకూడదని తెలిపారు.

యూపీఎస్సీ పరీక్షలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ఆదివారం జరిగే యూపీఎస్సీ పరీక్షలకు గ్రేటర్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని గ్రేటర్ ఆర్టీసీ ఈడీ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగే పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా సర్వీసులు నడుపుతామని తెలిపారు. బస్టాండ్లు, ముఖ్య పాయింట్లలో ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బస్సుల సమాచారం కోసం కోఠి - 9959226160, రేతిఫైల్ బస్‌స్టేషన్ - 9959226154లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌లో 3,853 మంది పిల్లలను రక్షించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా సైబరాబాద్, రాచకొండ కమిషరేట్‌ల పరిధిలో 3,853 మంది పిల్లలను పోలీసులు రక్షించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,374 మంది చిన్నారులను కాపాడారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 11 టీములుగా ఏర్పడిన అధికారులు 1,328 మంది బాలురు, 46 మంది బాలికలను కాపాడారు. రాచకొండ కమిషరేట్ పరిధిలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు 2,479 మంది చిన్నారులను వెట్టి నుంచి కాపాడారు. బాలలను పనుల్లో పెట్టుకున్న 530 మందిపై కేసులు నమోదు చేశారు. కాపాడిన చిన్నారుల్లో 2,353 మంది బాలురు, 126 మంది బాలికలు ఉన్నారు. చిన్నారులను వెట్టి చాకిరీ నుంచి కాపాడిన అధికారులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించారు.

అనారోగ్య పరిస్థితుల్లో విద్యార్థుల హాజరుపై కఠినంగా ఉండొద్దు

● గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అనారోగ్య కారణాలను, అందుకు సంబంధించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకుని హాజరుశాతంపై నిర్ణయం తీసుకోవాలని ఇంజనీరింగ్ కాలేజీని హైకోర్టు ఆదేశించింది. తీవ్ర అనారోగ్యం వల్ల విద్యార్థుల హాజరు శాతం తగ్గితే కఠినంగా వ్యవహరించరాదని పేర్కొంది. తాను ఇంజినీరింగ్ మూడో సంవత్సరం (2024-25) సెకండ్ సెమిస్టర్ పరీక్షలు రాయకుండా కాలేజీ సర్క్యులర్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరలోని గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)కి చెందిన బీటెక్ (సీఎస్ఈ) విద్యార్థిని కొండపర్తి మాన్విత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.శరత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్ష రుసుము వసూలు చేసిన కాలేజీ, ఆమె అనారోగ్య కారణాలను, వైద్య సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోకుండా 65 శాతం హాజరు లేదని 49 శాతమే ఉందంటూ పరీక్షలకు అనుమతించడం లేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఆమెకు వ్యతిరేకంగా కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌ను కొట్టివేసింది. పరీక్షలు రాసేందుకు అనుమతించాలని కాలేజీకి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.



వెంకట సుబ్బారావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న దత్తాత్రేయ, తదితరులు

నిస్వార్థ ప్రజాసేవకు ప్రతీక పింగళి వెంకయ్య

చిక్కడపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య నిస్వార్థ ప్రజాసేవకు ప్రతీక అని హరియాణా రాష్ట్ర పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో నిర్వహించిన కార్యక్రమంలో పింగళి వెంకయ్య 148వ జయంతి సందర్భంగా గోవిందరాజు వెంకట సుబ్బారావుకు పింగళి వెంకయ్య వంశీ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడారు. భూదాన ఉద్యమంలో మద్యపాన నిషేధం అమలు కోసం ఉద్యమించిన వెంకట సుబ్బారావు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పింగళి వెంకయ్య మనువడు నరసింహం, వంశీ రామరాజు, సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, సాహితీవేత్త డా.సుధాదేవి పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమపాలల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని కలిపి ముందుకు తీసుకుపోతున్నామని తెలిపారు. సంవత్సర కాలంలోనే సుమారు వంద కోట్లతో తుర్కయంజాల్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. దాదాపు 8,000 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే 7,455 రేషన్ కార్డులను అందిస్తున్నామని తెలిపారు. మిగిలిన ఐదు వందల కార్డులను కూడా అందిస్తామన్నారు. ఈ బాధ్యతను వార్డు అధికారులు తీసుకుని అర్హులకు అందించాలన్నారు. వార్డు కార్యాలయం ద్వారా లేదా ఆన్‌లైన్ ద్వారా కూడా రేషన్ కార్డును తీసుకోవచ్చునని వివరించారు.



లబ్దిదారులకు రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు భాస్కరాచారి, సీనియర్ నాయకులు సామ భీంరెడ్డి, కౌశిక ఐలయ్య, గుత్త వెంకట్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, కొంతం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి

చంపాపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను కోరారు. చంపాపేట డివిజన్ రెడ్డిబస్తీలో జీహెచ్ఎంసీ నిధులతో చేపట్టిన ఇంటర్నల్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శనివారం పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ నిర్మాణ పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరారు. జీహెచ్ఎంసీ ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, బస్తీవాసులు పాల్గొన్నారు.

ప్రతీ కాలనీ అభివృద్ధే లక్ష్యం : రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ డివిజన్‌లోని ప్రతీ కాలనీని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నారాయణపురికాలనీలో రూ.12లక్షలతో పూర్తిచేసిన స్టామ్ వాటర్ డ్రైన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అదేవిధంగా గ్లోబల్ ఆస్పత్రి రోడ్డులో పోతుగల్ స్వీట్ హౌస్ నుంచి పోస్ట్ ఆఫీస్ వరకు రూ.64లక్షలతో వేసిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మహేశ్వరి, వసంత, రోహిత్‌రెడ్డి, కరుణ్, విష్ణు, అమీర్, గౌస్ పాల్గొన్నారు.

రూ.లక్షల్లో ఖర్చయితే రూ.వేలల్లోనే సీఎంఆర్‌ఎఫ్ మంజూరు

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వివిధ రుగ్మతలతో, రోడ్డు ప్రమాదాల్లో గాయాలతో ఆస్పత్రుల్లో చేరి వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్న వారికి సైతం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.వేలల్లోనే సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందజేయడం సరికాదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆక్షేపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్యానికి అయిన ఖర్చులో 70శాతం దాకా సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు చేసేదని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఎంత ఖర్చయినా రూ. 60వేలలోపే మంజూరు చేస్తున్నదని ఆమె విమర్శించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్‌కు చెందిన జి.పార్వతమ్మకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును శనివారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సబితారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మీర్‌పేట్ 9వ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రామిడి నర్సిరెడ్డి, బాధితురాలి కుటుంబ సభ్యులు విజయ్, అరవింద్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రఘునందన్‌రావు, రాములు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

నట్టల నివారణ మందు పంపిణీ

హయత్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలో శనివారం స్థానిక కురుమ సంఘం ఆధ్వర్యంలో గొర్రెలకు నట్టల నివారణ మందును వేశారు. వర్షాకాలం కావడంతో రోగాలు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా గొర్రెలకు నట్టల నివారణ మందులను వేస్తున్నట్లు డాక్టర్ శిల్పారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, వస్పరి బాబయ్య, గుండ నర్సింహ, లింగమయ్య, గుండ కృష్ణ, బండారి మల్లయ్య, అనీల్, ప్రవీణ్, లోకేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయ పుస్తకాలను పఠించాలి

మన్సూరాబాద్: విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలయాల్లోని ప్రేరణ, విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను సైతం పఠించాలని నాగోల్ డివిజన్ జైపురి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయ తరగతిని శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులచే కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరెడ్డి, గాయత్రి, రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థి ఎంపిక

అబ్దుల్లాపూర్‌మెట్ : రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు మండలంలోని బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కూతాడి జతిన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్కూల్‌లో విద్యార్థికి స్పోర్ట్స్ యూనిఫాంను అందజేశారు. ఆగస్టు 3,4వ తేదీల్లో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ జూనియర్స్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కాగా శనివారం స్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌తో కలిసి హన్మకొండకు వెళ్లినట్లు హెచ్‌ఎం తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు పీపీటీ కిట్ల పంపిణీ

మన్సూరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని పెద్దచెరువు ప్రాంగణంలో పారిశుధ్య కార్మికులకు శనివారం ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసిన పీపీటీ కిట్లను హయత్‌నగర్ డీసీ వంశీకృష్ణ, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగ డీఈ కనకయ్య, శానిటేషన్ డీఈ నీలిమ, జవాన్ శ్రీనివాసరావు, శానిటేషన్ సిబ్బంది, వివిధ కాలనీవాసులు పాల్గొన్నారు.

నాగోల్ డివిజన్ పరిధిలో..

నాగోల్ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు శనివారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ పీపీటీ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్, శానిటేషన్ డీఈ నీలిమ, జవాన్ దర్శన్, ఎస్ఎఫ్ఏలు సురేష్, చారి, ఆనంద్ పాల్గొన్నారు.



పీపీటీ కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

వాహనాలు నడిపే వేళ సిగ్నల్స్‌పై దృష్టిపెట్టాలి

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

కొత్తపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే వేళ సిగ్నల్స్ రోడ్ సైన్స్ పైనా దృష్టిపెట్టాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. శనివారం మీర్‌పేటలోని ఓ ప్రైవేటు స్కూల్ నుండి 45మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. వారికి రెండు విడతల్లో లెక్చర్‌హాల్‌లో ట్రాఫిక్ నిబంధనల వీడియోలు, యానిమేషన్ చిత్రాలను ప్రదర్శిస్తూ నిబంధనలపై టీటీఐ ఇన్‌స్పెక్టర్ అవగాహన కల్పించారు.

14 అవగాహన కార్యక్రమాలు

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని హయత్‌నగర్ బస్‌స్టాపు, కుంట్లూరు టీజంక్షన్, నాగోల్ ఆనంద్‌నగర్ చౌరస్తాలలో సాధారణ ప్రజలకు, అనాజ్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్‌లలో ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు 14 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 479మంది ప్రజలకు, విద్యార్థులకు ఎస్ఐ నర్సింహారావు, ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఏఎస్ఐ సోమ్‌నాథ్ అవగాహన కల్పించారు.

మద్యంప్రియులకు డీడీ కౌన్సిలింగ్

డ్రంకెన్‌డ్రైవ్ వాహనాల తనిఖీల్లో పట్టుబడిన 45మంది మద్యంప్రియులకు 45మంది కుటుంబ సభ్యుల సమక్షంలో టీటీఐ లెక్చర్ హాల్‌లో శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు.

అత్యాచారం కేసులో ముద్దాయికి జైలు, జరిమానా

● బాధితురాలికి రూ. 5లక్షల పరిహారం

● ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు తీర్పు

హయత్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో ముద్దాయికి ఎల్బీనగర్‌లోని ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు 10 సంవత్సరాల జైలుశిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ బాధితురాలికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కథనం ప్రకారం.. మహబుబాబాద్ మండలం గడ్డిగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శేషగాని అశోక్‌గౌడ్(22) హయత్‌నగర్ వీరభద్రనగర్ కాలనీలో ఉంటున్నాడు. ఇదిలా ఉండగా అశోక్‌గౌడ్ 2017 సంవత్సరం జూలైలో ప్రేమ పేరుతో ఓ బాలికను సినిమాకు తీసుకువెళ్లాడు. తర్వాత పెండ్లి చేసుకుంటానని నమ్మించి అదే రోజు లాడ్జికి తీసుకువెళ్లి బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సునీత, రఘు, శోభారాణి కోర్టులో తమ వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 25వేల జరిమానా విధించి బాధితురాలికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పు చెప్పారు.



శేషగాని అశోక్‌గౌడ్

చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో శనివారం చేనేత కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మురళీధర్, జిల్లా అధ్యక్షుడు జాలిగాం వెంకటేష్, తెలంగాణ చేనేత కార్మిక ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్రం సురేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల సమస్యలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత బంధు పథకంలో అనేక నిబంధనలు పెట్టిందన్నారు. వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘం పాలకవర్గం ఎన్నికలను వెంటనే నిర్వహించాలన్నారు. నేత కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు మురళీధర్, వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో నేత కార్మికులు కిష్టయ్య, యాదయ్య, శ్రీనివాస్‌రావు, లింగయ్య, బాలనరసింహ, కేఎస్ రావు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నం

● చికిత్స పొందుతూ మహిళా కానిస్టేబుల్ మృతి

సరూర్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం, పల్లెచెల్కతండాకు చెందిన సుధాకర్‌నాయక్, మాడ్గుల మండలం, నాగిళ్ల గ్రామానికి చెందిన మనీషా ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సుధాకర్‌నాయక్ కుటుంబంతో కలిసి ప్రస్తుతం మీర్‌పేటలోని ప్రశాంతి హిల్స్‌లో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. భార్య మనీషా మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నది. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో దంపతుల మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మానసిక ఒత్తిడికి గురైన మనీషా గత నెల 25న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన భర్త సుధాకర్ ఆమెను తొలుత డీఆర్‌డీవో అపోలో ఆస్పత్రికి, అనంతరం అక్కడి నుంచి నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మనీషా మృతిచెందినది. విషయం తెలుసుకున్న మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి కాట్రావత్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు.



మనీషా(ఫైల్)

వాకింగ్ చేస్తుండగా మూర్ఛ

భవనంపై నుంచి పడి ఇంటర్ విద్యార్థి మృతి

సంతోష్‌నగర్,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తుండగా మూర్ఛ వచ్చి బిల్డింగ్‌పై నుంచి కింద పడి ఇంటర్ విద్యార్థి మృతిచెందాడు. ఈ విషాద సంఘటన ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంతోష్‌నగర్ దుర్గాభవానినగర్‌కు చెందిన బద్రీనాథ్‌రావు కుమారుడు గౌరవ్(17)ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసి వాకింగ్ చేసేందుకు మూడవ అంతస్తు ఎక్కాడు. నడుస్తుండగా ఒక్కసారిగా మూర్ఛ(ఫిట్స్) రాగా ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని వెంటనే కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



గౌరవ్(ఫైల్)

బీసీల రిజర్వేషన్ ధర్నాకు తరలిన బీజేపీ శ్రేణులు

సరూర్‌నగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బీసీలకు కచ్చితంగా 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో బీజేపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహా ధర్నాకు మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. బాలాపూర్‌కు చెందిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి స్థానిక పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా ఇందిరాపార్కుకు వెళ్లగా, బీజేపీ క్లస్టర్-2 అధ్యక్షుడు వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు బాలాపూర్ చౌరస్తా నుంచి ఇందిరాపార్కు వరకు ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కౌన్సిల్ బీజేపీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, నాయకులు రామిడి శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సందీప్‌కుమార్, జనార్దన్, నర్సింగ్‌రావు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



ధర్నాకు తరలుతున్న బీజేపీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్ : కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాకు పెద్ద అంబర్‌పేట నుంచి ఆ పార్టీ శ్రేణులు శనివారం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడెపు మధుగౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ధర్నాకు తరలిన వారిలో బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి పాపయ్యగౌడ్, పిల్లి శ్రీనివాస్‌యాదవ్, కట్ట సాయికిరణ్‌గౌడ్, శ్రీహరి ఉన్నారు.



సరూర్‌నగర్ నుంచి తరలివెళ్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్ తదితరులు

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తున్నదని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్-బీసీలపై కాంగ్రెస్ కపట నాటకాన్ని నిరసిస్తూ నగరంలోని ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో పాల్గొనేందుకు సరూర్‌నగర్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు గోవర్ధన్, జైన్‌బాబు, కబీర్‌దాస్ పాల్గొన్నారు.